క్లుప్తంగా

తోణాంలో ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు


జరుగుతున్న పారిశుద్ధ్య పనులు

సాలూరు: మండలంలోని తోణాం పంచాయతీలో పారిశుద్ధ్య పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. సర్పంచ్ మువ్వల ఆదయ్య ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ పనుల్లో భాగంగా కాలువల్లో పూడికలు తీసి, ట్రాక్టర్ల ద్వారా దూరప్రాంతాలకు తరలించడం, రోడ్డు పక్కన ఉన్న తుప్పలు తొలగించడం తదితర పనులు చేపట్టారు. ఆదివారం పంచాయతీలోని తోణాం, దిగువమెండంగి, మెట్టవలస గ్రామాల్లో ఈ పనులు జరిగాయి.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

సీతానగరం: మండలంలోని బూర్జ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధి గ్రామాలలో సోమవారం ప్రధాన పవర్‌లైన్, సబ్‌స్టేషన్‌లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లకు మరమ్మతుల కారణంగా ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని ఏఈ సోమేశ్వర రావు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన మాట్లాడుతూ బూర్జ విద్యుత్ సబ్‌స్టేషన్ నుంచి పవర్ వెళ్తున్న వైర్ల పై పామాయిల్ కొమ్మలు, పొడవైన చెట్ల కొమ్మలు పడిపోవడంతో సరఫరాలో అంతరాయం ఏర్పడుతోందన్నారు. ఈ నేపథ్యంలో ఉదయం నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

రోడ్డు నిర్మాణానికి భూమిపూజ


రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న స్థల దాతలు, ప్రజాప్రతినిధులు

పాలకొండ రూరల్: మండలంలోని లుంబూరు-కోటిపల్లి గ్రామాల మధ్య రోడ్డు నిర్మాణానికి ఆదివారం భూమిపూజ చేశారు. గుడివాడ చెరువు మీదుగా 4 కిలోమీటర్ల మేర జరిగే ఈ నిర్మాణంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇకనుంచి తమ పంటలను సులభంగా రవాణా చేసుకోవచ్చని చెబుతున్నారు. ఇదే గ్రామానికి చెందిన లోలుగు అప్పారావు, రాజాం ఏపీపీ కిమిడి సూర్యకుమార్, పార్వతీపురం మన్యం జిల్లాకి చెందిన ఏపీపీ కిమిడి చంద్రకుమార్ తదితరులు రోడ్డు నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని దానం చేయడంతో రోడ్డు నిర్మాణానికి మార్గం సుగమమైంది. కార్యక్రమంలో సర్పంచ్ తిర్లంగి ఉపేంద్రకుమార్, ఉప సర్పంచ్ పడాల రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

నవధాన్యాల సాగు.. నేలతల్లికి బాగు..


రైతులకు అందించేందుకు సిద్ధం చేసిన నవ ధాన్యాల కిట్లుతో ఏపీ సీఎన్‌ఎఫ్ సిబ్బంది

గుమ్మలక్ష్మీపురం: ప్రకృతి వ్యవసాయంలో భాగంగా చేసే నవధాన్యాల సాగుతో నేల సారవంతమవుతుందని ఏపీ సీఎన్‌ఎఫ్ ఎంటీ గోరిశెట్టి నిర్మలాదేవి అన్నారు. నవధాన్యాల సాగు నేలతల్లికి బాగు కార్యక్రమంలో భాగంగా మండలంలోని మండ గ్రామంలోని రైతులకు పంపిణీ చేసేందుకు సిద్ధం చేసిన నవధాన్యాల కిట్లను ఆదివారం ఆమె పరిశీలించారు. తొలకరి జల్లులు(వర్షం)కు ముందు పొలాల్లో ఈ నవధాన్యాలు చల్లుకుంటే నేలకు కావాల్సిన పోషకాలన్నీ అందుతాయన్నారు. దీంతో తక్కువ పెట్టుబడి, అధిక దిగుబడులు, ఆదాయం వస్తుందన్నారు. సమాజానికి మేలు చేసే ఆరోగ్యవంతమైన పంటలు అందించే ప్రకృతి వ్యవసాయం వైపు రైతులు ఆసక్తి చూపించాలని కోరారు.

ఘనంగా హనుమజ్జయంతి


అభయాంజనేయ స్వామిని వైఎస్సార్‌సీపీ భోగాపురం మండల అధ్యక్షుడు సూర్యనారాయణరెడ్డి, గౌరునాయుడు కుటుంబసభ్యులు

సీతానగరం: మండలంలోని పలుగ్రామాల్లో గల అభయాంజనేయ స్వామి ఆలయాల్లో ఆదివారం హనుమాన్ జయంతి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. స్థానిక అభయాంజనేయస్వామి ఆలయంలో నాగరాజు శర్మ ఆధ్వర్యంలో ఉత్సవాలు నిర్వహించి భక్తులకు ప్రసాద వితరణ చేశారు. కృష్ణారాయపురం జంక్షన్‌లో అభయాంజనేయస్వామి ఆలయంలో బలగ గౌరునాయుడు కుటుంబసభ్యుల ఆధ్వర్యంలో జరిగిన హనుమాన్ జయంతి సందర్భంగా స్వామి వారి కల్యాణంలో వైఎస్సార్ సీపీ భోగాపురం మండల అధ్యక్షుడు ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి, స్థానిక సర్పంచ్ జి.అన్నంనాయుడు, మాజీ సర్పంచ్ రెడ్డి అప్పలనాయుడు, పీఏసీఎస్ ఉపాధ్యక్షుడు పోల బలరాంనాయుడు, విశ్రాంత తెలుగు పండిట్ జి అప్పలస్వామి, తిరుమల ఆస్పత్రి డ్యూటీ డాక్టర్ జి.రామారావు పాల్గొని పూజలు నిర్వహించారు. అనంతరం వందలాది మంది భక్తులకు అన్నసంతర్పణ ఏర్పాటు చేశారు. అలాగే కె.సీతారాం పురంలో వై.మధుసూదనరావు కుటుంబసభ్యుల ఆధ్వర్యంలో హనుమాన్ జయంతి ఉత్సవాలు జరిగాయి. మరిపివలసలో సాయిభక్తుల ఆధ్వర్యంలో ఆంజనేయ స్వామి జయంతి ఉత్సవాలు జరిగాయి.

మక్కువలో..

మక్కువ: మండలంలోని అన్ని గ్రామాలలో ఆదివారం ఆంజనేయస్వామి జయంతి వేడుకలను భక్తులు ఘనంగా నిర్వహించారు. మక్కువ, కోన, కొండబుచ్చమ్మపేట, కవిరిపల్లి, చెముడు గ్రామాలలోని ఆంజనేయస్వామి ఆలయాల్లో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అలాగే మక్కువలో దీపాలంకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు.

రహదారి కల సాకారం


పూర్తయిన గ్రావెల్ రోడ్డు గుండా జరుగుతున్న రాకపోకలు

- సిరివరకు పూర్తయిన గ్రావెల్ రోడ్డు నిర్మాణం
- గిరిజనులను వీడిన రోడ్డు కష్టాలు

సాలూరు: మండలంలోని కొదమ పంచాయతీ సిరివర గ్రామానికి రోడ్డు నిర్మాణం ఆవశ్యకతను ప్రభుత్వం దృష్టిలో పెట్టి ఈ నిర్మాణానికి సంబంధించి అటవీ, ఆర్థిక తదితర అన్నిరకాల అనుమతులు సాధించడంలో ఉపముఖ్యమంత్రి రాజన్నదొర చేసిన కృషి ఫలించింది. మక్కువ మండలం చిలకమెండంగి నుంచి సాలూరు మండలం సిరివరకు సుమారు 8 కి.మీ. గిరిశిఖర మార్గం గుండా గ్రావెల్ రోడ్డు పూర్తయింది. ఈ మార్గం వల్ల ముఖ్యంగా చిలకమెండంగి, తాడిపుట్టి, బందమెండంగి, లుద్ధ, డోలివర, సిరివర తదితర గ్రామాలకు చెందిన సుమారు 1500 మంది గిరిజనులకు రహదారి కష్టాలు తొలుగుతున్నాయి. మా గిరిజనుల దశాబ్దాల కలను సాకారం చేసి మా సమస్యలను తొలగించిన ఉపముఖ్యమంత్రి, గిరిజనసంక్షేమశాఖా మంత్రి పీడిక రాజన్నదొర, ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డికి గిరిజనులు ధన్యవాదాలు తెలియజేస్తున్నారు.

నాడు-నేడు పనులను వేగవంతం చేయాలి


రావుపల్లి ప్రాథమిక పాఠశాలలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న ఎంఈఓ నాగభూషణరావు

గరుగుబిల్లి: మనబడి నాడు-నేడు రెండో విడత పనులను వేగవంతం చేయాలని ఎంఈఓ ఎస్.నాగభూషణరావు సూచించారు. ఆదివారం మండలంలోని రావుపల్లి, బంటువానివలస గ్రామ పాఠశాలల్లో జరుగుతున్న మనబడి నాడు-నేడు పనులను పరిశీలించిన ఆయన మండల వ్యాప్తంగా మొత్తం 31 పాఠశాలల్లో ఈ అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, నిర్మాణాలకు అవసరమైన సామగ్రిని పంపిణీ చేయడం జరుగుతోందని ఆయన తెలిపారు. నాణ్యతా ప్రమాణాల మేర పనులు చేపట్టాలని కాంట్రాక్టర్లను కోరారు. వేసవి సెలవులు పూర్తయ్యేలోగా పనులు పూర్తి చేసి, భవనాలను వినియోగంలోకి తీసుకురావాలన్నారు.

ముమ్మరంగా వేసవి దుక్కులు


ఉల్లిబద్రలో జరుగుతున్న వేసవి దుక్కులు

గరుగుబిల్లి: మండలంలోని తులసిరామినాయుడువలస, గొట్టివలస, గరుగుబిల్లి, పెద్దూరు, గొల్లవానివలస, ఉల్లిబద్ర, దళాయివలస, ఉద్దవోలు, కొంకడివరం గ్రామాల్లో వేసవి దుక్కులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. కొన్నిరోజుల క్రితం కురిసిన చిన్నపాటి వర్షాలకు నేల దుక్కులకు అనుకూలంగా ఉండడంతో రైతులు సంప్రదాయ పద్ధతుల్లో నాగళ్లతో దుక్కి పనులు ప్రారంభించారు.

మరోసారి వర్షం కురిస్తే గోగు పంట వేసేందుకు సిద్ధంగా ఉన్నామని అన్నదాతలు చెబుతున్నారు. ఇటీవల కురిసిన వర్షం నువ్వు సాగుకు అనుకూలమైందన్నారు.

నేటి నుంచి మామిడిపల్లి గ్రామదేవత పండగ

సాలూరు: మండల కేంద్రంలో భాగమైన మామిడిపల్లి గ్రామంలో ముంగారమ్మ గ్రామదేవత పండగ సోమవారం ప్రారంభం కానుంది. వేలాది సంఖ్యలో భక్తులు రానున్న క్రమంలో ఉపముఖ్యమంత్రి, గిరిజనసంక్షేమ శాఖామంత్రి పీడిక రాజన్నదొర ఆదేశాల మేరకు సర్పంచ్ సువ్వాడ శశికళ, వైస్ఎంపీపీ సువ్వాడ గుణవతి తదితరులు, అధికారుల ఆధ్వర్యంలో పండగ ఏర్పాట్లు జరుగుతున్నాయి. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. లో వోల్టేజి సమస్య తలెత్తకుండా అడిషనల్ ట్రాన్స్‌ఫార్మర్, 13 ఎలక్ట్రికల్ స్తంభాలు, తాగునీటి సమస్య తలెత్తకుండా బొక్కిపేట, బూర్జివీధుల్లో సబ్‌మెర్సిబుల్ మోటార్లు ఏర్పాటు చేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా సుమారు 120 మంది పోలీసులతో బందోబస్తు నిర్వహిస్తున్నట్లు రూరల్ ఎస్సై ప్రయోగమూర్తి తెలిపారు.

ఘనంగా అంతర్జాతీయ మాతృ దినోత్సవం



పాలకొండ రూరల్: స్థానిక శాఖా గ్రంథాలయంలో అంతర్జాతీయ మాతృ దినోత్సవం ఆదివారం నిర్వహించారు. ఇన్‌చార్జ్ లైబ్రేరియన్ బబ్బూరి గణేష్‌బాబు మాట్లాడుతూ సృష్టిలో తల్లిని మించిన దైవం లేదని, అందరూ తల్లిదండ్రులను తప్పనిసరిగా గౌరవించాలన్నారు. అనంతరం విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో డ్రాయింగ్ టీచర్ జి.మురళి తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన

గుమ్మలక్ష్మీపురం: అల్లూరి సీతారామరాజు జిల్లా(పాడేరు)లో మోదకొండమ్మ జాతర మహోత్సవంలో భాగంగా ఆదివారం పార్వతీపురం మన్యం జిల్లా, గుమ్మలక్ష్మీపురం మండలానికి చెందిన ఆదివాసీలు చేసిన సవర నృత్య ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఆదివాసీ థింసా ట్రస్ట్ అధినేత బిడ్డిక సాంబర ఆధ్వర్యంలో ఆదివాసీలు తమ సంప్రదాయం ప్రతిబింబించేలా చేసిన ఈ నృత్యం చూపరులను ఆకట్టుకుంది.

రెవెన్యూ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

- ఎమ్మెల్యేకు వినతి


ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న రెవెన్యూ సంఘం నాయకులు

పార్వతీపురంటౌన్: రెవెన్యూ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యే అలజంగి జోగారావును రెవెన్యూ ఉద్యోగులు అసోసియేషన్ జిల్లా చైర్మన్ గొట్టాపు శ్రీరామమూర్తి కోరారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఎమ్మెల్యే జోగారావుకు వినతిపత్రం అందజేశారు. ఆ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏపీ జేఏసీ అమరావతి రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు మూడవ దశ కార్యాచరణలో భాగంగా ఎమ్మెల్యే అలజంగి జోగారావుకు సమస్యలు తెలియజేశామన్నారు. కార్యక్రమంలో, అసోసియేట్ చైర్మన్ మరిపి శ్రీనివాస రావు, వైస్‌చైర్‌పర్సన్ కె.వి.భవాని, రెవెన్యూ అసోసియేషన్ సభ్యులు ఎ.సూర్యనారాయణ, పీఏస్‌ఎల్ కుమార్, బి.శివరామకృష్ణ, ఎం.రమణమూర్తి, హెచ్.ఎం. అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాసరావు, పీడీటీ ఉద్యోగులు జి.శ్రీనివాసరావు, ఎం.సుధ, ఆర్ఎస్‌వీ రావు, పీఎస్ నారాయణ, బీడీపీ రావు, బీటీపీ రావు, బి.ఆనంద్, ఆర్ఎస్ సాహు, కె.కె.గౌరి, డీఎస్.చలం, విశ్రాంత ఉద్యోగులు గొర్లె అప్పలరాజు ఇతర ప్రభుత్వ ఉద్యోగులు పాల్గొన్నారు.

పెండింగ్ చలానాలు తక్షణమే చెల్లించాలి


పెండింగ్ చలానా డ్రైవ్‌లో పాల్గొన్న ఎస్సై పాపారావు

పార్వతీపురంటౌన్: పెండింగ్ చలానాలను తక్షణమే చెల్లించాలని ట్రాఫిక్ ఎస్సై పాపారావు కోరారు. ఈ మేరకు ఆదివారం పట్టణంలోని కొత్తవలస కూడలి వద్ద వాహనదారుల దగ్గర నుంచి పెండింగ్‌లో ఉన్న చలానాల వసూలుకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్పీ ఆదేశాల మేరకు వాహనాలకు సంబంధించి పెండింగ్ ఉన్న చలానాలు వెంటనే చెల్లించాలన్నారు. లేదంటే వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. జిల్లాలో నెల రోజుల పాటు ప్రత్యేక చలానాల డ్రైవ్ నిర్వహిస్తామని వాహనదారులందరూ పోలీస్ శాఖ వారికి సహకరించాలని కోరారు. అలాగే వాహనదారుల దగ్గర లైసెన్స్, సి బుక్ ఇతర పత్రాలను పరిశీలించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సిబ్బంది కిశోర్ సంపత్, సింహాచలం పాల్గొన్నారు.

పండగలకు ప్రత్యేక బందోబస్తు


మామిడిపల్లిలో కవాతు నిర్వహిస్తున్న పోలిసులు

- రూరల్ సీఐ ధనుంజయరావు

సాలూరు:

రూరల్ సర్కిల్ పరిధిలో సోమవారం నుంచి గ్రామదేవతల పండగలు జరుగుతున్న గ్రామాల్లో ప్రత్యేక బందోబస్తు నిర్వహిస్తున్నట్లు రూరల్ సీఐ ధనుంజయరావు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన మాట్లాడుతూ, సాలూరు మండలంలోని మామిడిపల్లి గ్రామ దేవత పండగకు 120 మంది, పాచిపెంట మండలం గురివినాయుడుపేట గ్రామదేవత పండగకు 30 మంది పోలీసులతో పటిష్టమైన బందోబస్తునిర్వహిస్తున్నామని వివరించారు. శాంతి భద్రతల దృష్ట్యా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి శాంతిభద్రతలతో పాటు వేలాది సంఖ్యలో భక్తులు రానున్న క్రమంలో ట్రాఫిక్‌సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామాల్లో పోలీసులతో కవాతు నిర్వహించామని తెలిపారు. శాంతియుత వాతావరణంలో పండుగలు ప్రశాంతంగా జరిగేందుకు ప్రజలు పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

ఉత్సాహంగా చెస్ పోటీలు


చెస్ పోటీల్లో నిమగ్నమైన విద్యార్థులు

భామిని: సమ్మర్ క్యాంప్‌లో భాగంగా స్థానిక శాఖాగ్రంథాలయంలో విద్యార్థుల మధ్య చేపట్టిన చెస్, క్యారమ్స్ పోటీలు చాలా ఉత్సాహంగా సాగాయి. ఈ పోటీల్లో విజేతలుగా నిలిచిన వారిని సిబ్బంది అభినందించారు. అనంతరం కథలు, పుస్తక పఠనం పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ ఎ.సునీత తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్‌కు అంతరాయం


పాలకొండ-విశాఖ రోడ్డులో నెలకొన్న ట్రాఫిక్

పాలకొండ రూరల్: స్థానిక పాలకొండ-విశాఖపట్నం, పాలకొండ-వీరఘట్టం రోడ్లలో ఆదివారం ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. కోటదుర్గమ్మ సంబరాల నేపథ్యంలో రోడ్లపై భక్తుల రద్దీ, వాహనదారుల రాకపోకలు అధికంగా ఉండడంతో ఈ ట్రాఫిక్ జామ్ ఏర్పడినట్లు స్థానికులు చెబుతున్నారు.

మధ్యాహ్నం తలెత్తిన ఈ సమస్యపై అప్రమత్తమైన పోలీసులు ఆయా రోడ్లకు చేరుకుని, ట్రాఫిక్ సమస్య లేకుండా చర్యలు తీసుకున్నారు.


పాలకొండ రూరల్: వెంకటాపురంలో పూజలు చేస్తున్న భక్తులు (ఇన్‌సెట్లో) వీరఘట్టం: హుస్సేన్‌పురం ఆంజనేయస్వామి ఆలయంలో భక్తుల ప్రత్యేక పూజలు


జియ్యమ్మవలస: దాసరిపేటలో స్వామి విగ్రహాలను ఊరేగిస్తున్న భక్తులు


పాలకొండ: ఉత్తరాముఖ ఆంజనేయస్వామి ఆలయంలో భక్తుల పూజలు


భామిని: సింగిడిలో పూజ లందుకున్న హనుమాన్

జై.. హనుమాన్..

జై హనుమాన్ నామస్మరణ మార్మోగింది. ఆంజనేయస్వామి జయంతి పురస్కరించుకుని, పట్టణాలు, పల్లెల్లోని ఆలయాలు భక్తులతో ఆదివారం కిటకిటలాడాయి. వేదపండితులు, పురోహితుల ఆధ్వర్యంలో ప్రత్యేకాభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం ప్రధాన వీధుల్లో స్వామి చిత్రపటాలు, విగ్రహాలను ఊరేగిస్తూ జై వీరాంజనేయ, జై జై హనుమాన్ అని నినాదాలు చేశారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం చేపట్టి, భక్తులకు అన్నప్రసాదం అందజేశారు. ఆయా కార్యక్రమాలతో అంతటా పండగ సందడి నెలకొంది.

–సాక్షి నెట్‌వర్క్